ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలుషిత నీటి సమస్యకు పరిష్కారం


హరినగర్‌లో నల్లాల్లో వస్తున్న కలుషిత నీటిని పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని హరినగర్, అబ్బసాయి మన్షన్ ఏరియా, కృష్ణనగర్, అంబేద్కర్‌నగర్, ఎస్.ఆర్.టి కాలనీలలో నల్లాల్లో సరఫరా అవుతున్న కలుషిత మంచి నీటి సమస్యను చిలకలగూడ జలమండలి అధికారులు శుక్రవారం పరిశీలించారు. నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా, ప్రజల ఇబ్బందులు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జలమండలి డీజీఎం మోహన్‌రావు స్పందించి పరిశీలించి నివారణ చర్యలు చేపట్టారు.

పట్టాభి టవర్స్‌కు షోకాజ్ నోటీసు జారీ

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని పట్టాభి టవర్స్‌కు సంబంధించిన దారి, అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను మూడు రోజుల్లో సమర్పించాలని జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శుక్రవారం నోటీసు జారీ చేశారు. పట్టాభి టవర్ పక్కన గల డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి అధినేత డాక్టర్ శంకర్ పట్టాభి టవర్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోటీసు జారీ చేశారు. కొద్ది రోజులుగా శంకర్ ఆస్పత్రి యాజమాన్యానికి పట్టాభి టవర్స్‌కు జరుగుతున్న వివాదం నేపథ్యంలో ఇరువురి డాక్యుమెంట్లు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవడానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.


గోల్నాక తులసీనగర్‌కాలనీలో క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్నాక, మే 16 (ఆంధ్రజ్యోతి): గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 28 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10లక్షల 32వేల ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎంఎఫ్‌ఆర్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పట్లూరి సతీష్, తుమ్మల నర్సింహారెడ్డి, పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచిన మెట్రోరైలు చార్జీలను రద్దు చేయాలి

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం డిమాండ్

నల్లకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎల్ అండ్ టీ సంస్థ పెంచిన హైదరాబాద్ మెట్రోరైల్ చార్జీలను ఉపసంహరించుకోవాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, కె.వీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లకుంటలోని ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్ ఆండ్‌టీ మెట్రోరైల్ సంస్థ నష్టాలు వస్తున్నాయనే సాకుతో 20 నుంచి 42 శాతం వరకు చార్జీలు పెంచిందని, ఇది సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతుందన్నారు. ఎల్ ఆండ్ టీ సంస్థ చేసుకున్న అగ్రిమెంట్‌లో 50 శాతం టికెట్ల చార్జీలు, 50 శాతం రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని, కానీ ఒప్పందాన్ని ఉల్లంఘించి టికెట్ చార్జీలు పెంచిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పెంచిన మెట్రోరైల్ చార్జీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మెట్రోరైలు కోచ్‌లను 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అభిషేక్ కుమార్‌కు సన్మానం

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీలో చదువుకుంటూ పోటీపరీక్షలకు ప్రిపేరై పరీక్ష రాసి రాష్ట్ర ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించిన యువకుడు అభిషేక్ కుమార్‌ను చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం సన్మానించారు. హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి ఈ సందర్భంగా అభిషేక్‌ను సన్మానించి మాట్లాడుతూ, హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ పరిదిలోని గన్‌ఫౌండ్రి శాఖాగ్రంథాలయంలో పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతూ పరీక్ష రాసి ఉద్యోగం సంపాదించడం లైబ్రరీకి గర్వకారణమన్నారు.

కళాకారులకు వయసు అడ్డంకి కాదు : సముద్రాల

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): నిజమైన ప్రతిభా సంపత్తి ఉంటే కళాకారులకు వయసు అడ్డంకి కాదని కేంద్ర పూర్వ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. రామకృష్ణ మధుర గళ సంపన్నుడని ప్రశంసించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ గంటీస్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో ప్రముఖ గాయకులు వైఎస్ రామకృష్ణ అభినందన సభ జరిగింది. వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రామకృష్ణ భార్య లలిత కూడా గాయని కావడం, ఇరువురి అభిరుచి ఒక్కటే కావడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాలరావు, కాంగ్రెస్ నాయకుడు నిరంజన్, అగర్వాల్, కిన్నెర రఘురామ్, ఓంకార్‌రాజు, దైవజ్ఞశర్మ, సంస్థ అధ్యక్షులు గంటి రామకృష్ణ తదితరులు పాల్గొని రామకృష్ణను కళా కౌస్తుభ బిరుదుతో సత్కరించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. అంతకుముందు సుప్రభాత సేవ, పుణ్యాహవాచనము, మహానివేదన, హవనము, తీర్థప్రసాద వినియోగము జరిగాయి. కల్యాణానికి ముందు ఎదుర్కోళ్ల కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

'బడాబాబుల కట్టడాలపై చర్యలు తీసుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేదల ఇళ్లు కూల్చడం మాని చెరువులు, నాలాలు కబ్జా లు చేసి నిర్మించిన బడాబాబుల కట్టడాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రభుత్వాన్ని, హైడ్రా కమిషనర్‌ను డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైడ్రాతో ప్రభుత్వం పేదలు నిర్మించుకున్న ఇళ్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరం

- ఇంటింటికి వచ్చే రిక్షాలు, ఆటోలలోనే చెత్త వేయాలి
- డెంగీ అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్లు పద్మావెంకటరెడ్డి, కన్నె ఉమాదేవి



బాగ్ అంబర్‌పేటలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది

నల్లకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని కాలనీలు, బస్తీల లో ఇంటింటికి వచ్చే రిక్షాలు, ఆటోలలోనే ప్రజలు చెత్త వేయాలని స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరవని ఆమె తెలిపారు. శుక్రవారం డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఆధ్వర్యంలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది పలుచోట్ల పేరుకుపోయిన చెత్త, చెదారం, మట్టికుప్పలను ఎత్తివేసి వరద నీరు, కాలువల్లో ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కొందరు చెత్తను రోడ్లపైనే వేస్తున్నారని ఇది తగదన్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధిచెంది అనారోగ్యం పాలయ్యే దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఈఎఫ్‌ఏ రాఘవేందర్, ఏఎన్‌ఎం మెడికల్ ఆఫీసర్ నజిమా, సూపర్‌వైజర్ పద్మ, శాంతి, ఫీవర్ ఆస్పత్రి వైద్యులు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బర్కత్‌పురలో ర్యాలీ

బర్కత్‌పుర మే 16 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమలను పూర్తిస్థాయిలో నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా బర్కత్‌పుర అంజయ్యపార్కు సమీపంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీ నిర్వహించారు.

నెహ్రూనగర్‌లో..

గోల్నాక, మే 16 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లో జీహెచ్‌ఎంసీ ఎంటోమాలజీలు, ఆశావర్కర్లు డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు నినాదాలతో కూడిన ప్లకార్డులను చేతబూని బస్తీలలో ర్యాలీ నిర్వహించారు.


కాచిగూడ డివిజన్‌లో ర్యాలీలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

ఆధ్యాత్మికతకు నిలయాలు.. ఆలయాలు : ఎమ్మెల్యే ముఠా గోపాల్


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ ఈవో అన్నపూర్ణ తదితరులు

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు.. ఆధ్యాత్మికతకు నిలయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవా ల సందర్భంగా శుక్రవారం ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, రామ్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, దామోదర్‌రెడ్డి, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, గోక నవీన్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శేఖర్, రాజు, సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, అమర్ పాల్గొన్నారు.

నేడు భోలక్‌పూర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

ముషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ శనివారం ఉదయం 11.30 గంటలకు పాదయాత్ర చేస్తారని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు తెలిపారు. డివిజన్‌లోని రంగానగర్, బొంతల బస్తీ, బంగ్లాదేశ్ మార్కెట్, గుల్షాన్ నగర్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకుంటారని వై.శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు

జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజలరెడ్డి



ఎన్టీఆర్ స్టేడియంలో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను సీజ్ చేస్తున్న డీఎంసీ

రాంనగర్/కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో అక్రమంగా వాహనాల పార్కింగ్, చెత్త ఇంటి వ్యర్థాలు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజలరెడ్డి హెచ్చరించారు. దోమలగూడలోని ఎన్టీఆర్ స్టేడియంలో కొంత కాలంగా అక్రమంగా పార్కు చేస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులను పిలిపించి జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా ఎన్టీఆర్ స్టేడియంలో పార్కు చేసిన పలు వాహనాలను ట్రాఫిక్ పోలీసులను పిలిపించి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువకులు ఆడుకోవడానికి జీహెచ్‌ఎంసీ ఎన్టీఆర్ స్టేడియం కొనసాగుతుందన్నారు. అయితే కొంత మంది వాహనదారులు స్టేడియాన్ని పార్కింగ్ స్థలంగా వాడుకుంటూ స్టేడియం ప్రతిష్టను దిగజారుస్తున్నారని అన్నా రు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులకు ఇంటి వ్యర్థాలను తీసుకువచ్చి వేస్తున్నారని, దీంతో మైదానం కలుషితమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రవీణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫీజులు పెంచితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కోర్సుల ఫీజులను పెంచాలన్న యోచనను వెంటనే విరమించుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ ఫీజులను పెంచాలని యోచిస్తోందని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అందాల పోటీల కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తక్షణమే రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని లేకపోతే రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బీసీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

'20న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి'

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలోబహుజన కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్‌యూనియన్ (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడుతూ భారత బహుజన కార్మికవర్గానికి రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను రద్దుచేసి కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను తెచ్చిన బీజేపీ కేంద్రప్రభుత్వం అంబానీ, అదానీ లాంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు లాభాల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక 4 కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆలోపు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర రక్షణ చట్టాలను చేయాలని డిమాండ్ చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మనం సైతం.. దేశం కోసం

బీజేపీ ఆధ్వర్యంలో నేడు ట్యాంక్‌బండ్‌పై తిరంగా యాత్ర


ఓయూ గేట్ వద్ద వాకర్స్‌కు కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌతమ్‌రావు, తదితరులు


మహాత్మానగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, కనకేష్ కుమార్

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడాన్ని స్వాగతిస్తూ భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన శనివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే 'మనం సహితం, దేశం కోసం తిరంగాయాత్ర' జయప్రదం చేయడానికి ప్రజలందరూ పాల్గొనాలని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు కోరారు. తిరంగాయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఓయూ గేట్ వద్ద వాకర్స్‌ను కలిసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అడప చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గోల్నాక అన్నపూర్ణనగర్ బస్తీవాసులు

అన్నపూర్ణనగర్‌లో..

గోల్నాక: గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్ బస్తీవాసులు విజయోత్సవ తిరంగా ర్యాలీని కొవ్వొత్తులతో చేతిలో జాతీయ జెండాను పట్టుకుని బస్తీ నుంచి పూలే చౌరస్తావరకు నిర్వహించి అమరులకు నివాళులర్పించారు. దేశ సైన్యానికి తామంతా అండగా ఉంటామని శపథం చేశారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు సాయికృష్ణయాదవ్, కరుణాకర్ గౌడ్, విజయ్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్, నర్సింగ్ ముదిరాజ్, పాక వెంకటేష్, శ్రీకాంత్‌ముదిరాజ్, సురేందర్‌గౌడ్, మున్నా బస్తీవాసులు పాల్గొన్నారు.

బుక్‌చేసిన 24 గంటల్లోనే ట్యాంకర్

- బోట్స్‌క్లబ్ సబ్ డివిజన్ వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి

ఇంటర్వ్యూ



కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని, మరమ్మతుల కారణంగా నీటిసరఫరాకు అంతరాయం కలిగితే ఆయా ప్రాంతాలకు ఉచిత మంచినీటి ట్యాంకులు పంపించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని బోట్స్‌క్లబ్ సబ్ డివిజన్ వాటర్‌వర్క్స్ డీజీఎం జి.కార్తీకరెడ్డి అన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో లో ప్రెషర్, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టిసారిస్తున్నామని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరించారు.

ఆంధ్రజ్యోతి: వేసవి కాలంలో సబ్‌డివిజన్ పరిధిలో ప్రజల అవసరాలకు సరిపోను నీటి సరఫరా జరుగుతుందా?

డీజీఎం: చిలకలగూడ రిజర్వాయర్, మేకలమండి రిజర్వాయర్ల నుంచి కృష్ణాజలాలు, ఆసిఫ్‌నగర్ రిజర్వాయర్ నుంచి గండిపేట నీరు వస్తుందని ఎప్పటిలాగే బోట్స్ క్లబ్ పరిధిలోని కవాడిగూడ, భోలక్‌పూర్, దోమలగూడ, గాంధీనగర్ సెక్షన్‌లలో సరిపోను నీటిసరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: లో ప్రెషర్‌తో నీరు వస్తుందని ఫిర్యాదులు వస్తున్నాయి. చర్యలేంటి?

డీజీఎం: కొన్ని ప్రాంతాలలో అప్పుడప్పుడు లో ప్రెషర్ నీరు వస్తుంది. ఈ కారణంగా ఆయా ప్రాంతాలకు పంపింగ్ ద్వారా సరఫరా అందిస్తున్నాం. విద్యుత్ అంతరాయం వల్ల సమస్య వస్తుంది. ముఖ్యంగా బీమామైదాన్, మైసమ్మబండ, ఎంసీహెచ్‌క్వార్టర్స్, అడ్వకేట్ కాలనీలో సమస్య ఉంది.

ఆంధ్రజ్యోతి: కవాడిగూడ కొత్త బజార్ నుంచి తాళ్లబస్తీ వరకు నిత్యం డ్రైనేజీలు నిండిపొంగిపొర్లుతూ కలుషిత నీరు సరఫరా అవుతుంది. పైప్‌లైన్ ఆధునీకరణకు చర్యలపై ప్రతిపాదనలు పంపించారా?

డీజీఎం: కవాడిగూడ కొత్తబజార్‌నుంచి తాళ్లబస్తీ వరకు కొన్ని రోజులుగా పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ వల్ల డ్రైనేజీలు నిండి పోయాయి. కొన్ని సార్లు కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఫిర్యాదు వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. పైప్‌లైన్ ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపించాం.. నిధులు మంజూరు కాగానే ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి: బుకింగ్ చేసిన ఎన్నిరోజుల్లో ట్యాంకర్లను సరఫరా చేస్తున్నారు?

డీజీఎం: బుకింగ్ చేసిన 24 గంటల్లోనే ట్యాంకర్ పంపిస్తున్నాం. ఒకరోజు ముందు బుక్‌చేస్తే రూ.500. ఎమర్జెన్సీ, కమర్షియల్ ట్యాంకర్ రూ.850.

ఆంధ్రజ్యోతి: నీటి వృథా అరికట్టేందుకు చర్యలేంటి? నల్లాలకు మోటార్లు బిగిస్తే చర్యలేంటి?

డీజీఎం: బస్తీల వారీగా అవగాహన చేపడుతున్నాం. వృథా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. నల్లాలకు మోటార్లు బిగించి వాడుకుంటున్న 30మందిపై చర్యలు తీసుకున్నాం.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చత్రినాకకు చెందిన శివరామకృష్ణ (28) ప్రైవేట్ ఉద్యోగి. కాగా గురువారం ఉదయం నాగమయ్యకుంటలోని బంధువుల ఇంటికి చేరుకున్న ఆయన రాత్రి 10 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రేమించిన యువతికి వివాహం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకోవాలని యువతికి వేధింపులు

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధించిన యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. కింగ్‌కోటి షేర్ గేట్‌కు చెందిన షేక్ ఇర్షాద్ అలియాస్ పాషా (21) డిగ్రీ పూర్తి చేశాడు. నింబోలి అడ్డకు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలికను మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నాడు. ఇప్పుడు ఆమెకు 20 ఏళ్లని, పెళ్లి చేసుకుంటానని వేధింపులకు పాల్పడుతుండగా.. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో మాయమాటలు చెప్పి బంగారం తీసుకున్నాడని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి తల్లి వీహెచ్‌పీ నేతలను సంప్రదించగా, వారు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడికి, వీహెచ్‌పీ నేతలకు వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు ఇర్షాద్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని సీఐ తెలిపారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహం పక్కన చిత్తుకాగితాల బస్తా ఉందని, కాగితాలు ఏరుకునే వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ- 1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. అంబర్‌పేట 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30నుంచి 10,ప్లేగ్రౌండ్, శంకర్‌మఠ్, బసంత్ కాలనీ ఫీడర్ల పరిధిలో 10.30 నుంచి 11, సిసి ష్రాఫ్ పరిధిలో 10నుంచి 10.30, బొగ్గులకుంట, కామినేని పరిధిలో 9నుంచి 11, గగన్‌మహల్, గోశాల, తాళ్లబస్తీ పరిధిలో 9.30నుంచి 11, ఆనంద్‌నగర్ పరిధిలో 10నుంచి 11, హైదర్‌గూడ పరిధిలో సాయంత్రం 3నుంచి 4, జామై ఉస్మానియా, హిందీప్రచారసభ, ఏవీ కాలేజీ, తాజ్‌మహల్ పరిధిలో 3 నుంచి 5, బౌద్ధనగర్ పరిధిలో 4నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రక్తపోటుపై అవగాహన సదస్సు

ముషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో రక్తపోటుపై అవగాహన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ శుక్రవారం తెలిపారు. రక్తపోటు లక్షణాలు గల వ్యక్తికి అధికంగా తలనొప్పి, దృష్టి సమస్య, ముక్కునుంచి రక్తం కారడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, నీరసం, మూత్రపిండాల పనితీరు క్షీణించడం తదితర లక్షణాలతో బాధపడుతారని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్నవారు సకాలంలో వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందితే రక్తపోటును తగ్గించవచ్చు అన్నారు. రక్తపోటుపై ఆసుపత్రిలో నిర్వహించే అవగాహన సదస్సు, వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సూచించారు.

